కొంటే వారి వైద్య ఖర్చులు తడిసి మోపెడు అయి పిల్లలకూ యిబ్బందిగానే వుంది. ఇదొక విచిత్ర పరిస్థితి. అందుకని ప్రవాసీయులు ముసలి తల్లిదండ్రులను స్వదేశానికి పంపించేస్తున్నారు. లేక స్వదేశంలో వారిని శరణాలయాలలో చేర్చాల్సిన పరిస్థితులు కలిగాయి. ఇది తప్పని సరి అని కుర్రకారు భావిస్తే, ఇది తమ పాలిటి శాపం అని ముసలివారు అనుకొంటున్నారు.

తలిదండ్రులు కుదిర్చిన వివాహాలు చేసుకునే సంప్రదాయం నుండి, వారిష్టమెచ్చిన వారిని ఎన్నుకొని పెళ్ళి చేసుకొనే పద్ధతి వచ్చేసింది. ఇక్కడి వారిని పెళ్ళి చేసుకోవటం నుంచి, అక్కడ వారినే వివాహమాడే స్థితి వచ్చింది. అమెరికాలో బహు సంతానంపై నిషేధం లేదు కాని మన దేశంలో "మనిద్దరం - మనకిద్దరు" చాలాకాలంగా అమలులో వుండి, కుటుంబ నియంత్రణ మధ్య తరగతి కుటుంబాలలో బాగా పాతుకుపోయింది. ఇదే అభిప్రాయాన్ని ప్రవాసీయులు అక్కడ అమలు జేసి పరిమిత సంతానాన్నీ కనటం ఫ్యాషన్ అయిపోయింది. ఉద్యోగభద్రత ఇటీవల బాగా కష్టమైనందున భార్య కూడా వుద్యోగం చేస్తేరే లేకపోతే కుటుంబం గడవటం కష్టమై పోయింది. ఇది ఇండియాలోను, అమెరికాలోనూ ఒకే విధంగా వుంది. విదేశాలలో వున్నవారు పెళ్ళి, పిల్లల్ని కనటం, పిల్లలవిద్య అన్ని అక్కడే జరిగే ఏర్పాట్లు చేసుకొంటున్నారు. ఇందులో స్వలాభం వున్నా, స్వార్థం కూడా వుంది. దీనితో స్వదేశంలోని తలిదండ్రులేవారికి "ఫారినర్స్" అయిపోయారు. ఇదీ నేటి తీరాంధ్ర మధ్య తరగతి కుటుంబాల పరిస్థితి, యువత తీరు, తెన్నును.

## మరుగునపడుతున్న మానవత్వం

కంప్యూటర్, ఐ.టి. విద్యల మీదే అందరి దృష్టి. దానినే నమ్ముకొనే పరిస్థితి. దానికే ఒళ్ళు అమ్ముకొనే దారుణ స్థితి ఏర్పడటం శోచనీయం. మేధస్సే కొలమానంగా, ప్రమాణంగా మారి పోయింది. దీని వల్ల హృదయం, మనసులకు ప్రాధాన్యత తగ్గిపోయింది. సోషల్ సైన్సెస్‌పై అసలు ఎవరూ దృష్టి పెట్టకపోవటం దారుణం. అందువల్ల సమాజంలో అసమానతలు పెరిగి పోతున్నాయి. ఆప్యాయతలు ఆవిరవుతున్నాయి. బంధాలు సడలిపోతున్నాయి. ఏ సమాజానికైనా యివి చెరుపు చేసే విషయాలే. వ్యక్తిత్వ విలువ, కుటుంబ, సామాజిక విలువలు, ముఖ్యంగా మానవత్వపు విలువలు మట్టిపాలౌతున్నాయి. సత్యం, ధర్మం అహింస, పవిత్రత, నిస్వార్థత, కరుణ, క్షమ, కృతజ్ఞత, పరస్పర సహాయ సహకారాలు మొదలైన సార్వజనీన శాశ్వతములకు యువత దూరమైపోతోంది. ఇదంతా సమాజ పతనానికి మహాప్రస్థానమే. జాగ్రత్త పడకపోతే భవిష్యత్ తరాలకు మనం జవాబు చెప్పుకొనే హీనస్థితిలోకి పడిపోతాం. తస్మాత్ జాగ్రత్త.

గ్లోబలైజేషన్ వల్ల దేశాల మధ్య, ప్రాంతాల మధ్య అంతరాలు తగ్గిపోతున్నాయన్నది ముమ్మాటికి నిజమే. కాని మనసుల మధ్య దూరాలు పెరిగిపోవటమే కాదు, అగాధాలు ఏర్పడ్డాయి. ఇది హర్షించదగిన పరిణామం కాదు. సుఖసాధనాలు పెరిగినకొద్దీ, సుఖ శాంతులు కనుమరుగౌతున్నాయి. మేధ వికసిస్తోంది కాని, హృదయం సంకోచించిపోతోంది. అవతలి వారి హృదయాన్ని అర్థం చేసుకొనే ఆలోచన, సమయం వుండటం లేదు. ప్రేమించలేదని పగబట్టటం, యాసిడ్ దాడులు, రేపులు చేసి, యువత బంగారు భవిష్యత్తును మంటగలుపుకొంటోంది. ధన సంపాదనలో విచక్షణా జ్ఞానం నశించి, అడ్డగోలు సంపాదన, వంచనతో పదవులకు పాకటం ఎక్కువైపోయింది. వేగం జీవితాన్ని ఆగం చేస్తోంది. అవకాశవాదం మర్రిమానులా విస్తరించి, దాని క్రింద ఏ జీవీ జీవించలేనంత దుస్థితి ఏర్పడుతోంది. వీటన్నిటికి కారణం. సనాతనంగా మధ్యతరగతి కుటుంబాలలో వున్న ధర్మం, న్యాయం, నీతి యువతకు అందక పోవటమే. ధర్మచ్యుతి దేశభవితకు పెద్ద అవరోధం. "బహుజనహితాయ, బహుజనసుఖాయ" పోయి, "చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష" యే మంత్రమై పోయింది. ప్రేమ, జాలిలేని నికృష్ట బతుకులు బతుకుతున్నాం. స్వార్థం, ద్వేషాలతో రగిలి అగ్నిపర్వతాలై యువత విజృంభించి, విచక్షణను కోల్పోతుంది. సంఘటిత యువత ఎంత పనైనా చేస్తుందని గత రెండు మూడేళ్ళుగా ప్రపంచ దేశాలలో కర్కోటక నియంతలను మట్టి గరిపించి, దేశాల నుండి బయటకు పారిపోయేలా చేసిన యువశక్తి ఆదర్శప్రాయమై నిలిచింది. దేశహితం కోసం, సమాజ శ్రేయస్సు కోసం యువత పనిచేస్తే ఇలలో నందన వనాలు ఏర్పడతాయి. యువత భవితకు సహజసిద్ధమైన కార్యక్రమాలు అమలు జరగాలి. వారి శక్తిని, మేధస్సును ఉపయోగించుకొని, అభ్యుదయపథం వైపు మళ్ళించాలి. లేకుంటే క్రమశిక్షణా రాహిత్యం పెరిగి సమస్యలు తామరతంపర లౌతున్నాయి. ఈ స్థితిలో సమాజాన్ని రక్షించాలంటే "సామాజిక స్పృహ"తో యువత ఆలోచిస్తే వికసించాలి. సర్వమానవ ప్రేమ, సౌభ్రాతృత్వం, సర్వమత సమన్వయం, విశ్వశాంతి, వసుధైక కుటుంబ భావన వారిలో కలగాలి. ఇందుకోసం మేధస్సును పెంచే చదువుతో బాటు మనసు, హృదయాలను వికసింపజేసే సోషల్ సైన్సెస్ నేర్పాలి. వీటివల్ల మనం ఎవరం? మన జాతి, భాష, సంస్కృతిలపై అవగాహన పెరుగుతుంది. అప్పుడే మనం ఏమి కోల్పోయామో తెలిసి మళ్ళీ వాటిని పొందగలం.

ఐ.టి.రంగంలో "బూమ్" వున్నంతకాలం యువత అవకాశాలకు ఆకాశమే హద్దు అయింది. ఆ రంగం గత అయిదేళ్ళుగా "బ్లాస్ట్" అవటంతో వారి సమస్యలు పెరిగిపోయాయి. అనిశ్చిత ఉద్యోగాలు, బోర్డులు తిప్పేసిన ఐ.టి. కంపెనీలు, అడిగిన జీతం కాక, ఇచ్చిన జీతానికే కుక్కిన పేనుల్లా పని చేయాల్సిన హీన, దీన స్థితి వచ్చింది. రోజుకు ఎనిమిది గంటల షెడ్యూల్ పని అటకెక్కింది. 16 నుండి